సాక్షి
ఖమ్మం
బుధవారం • 7 • ఆగస్టు • 2024



దంచి కొట్టిన వాన

జిల్లాలోని తల్లాడలో భారీ వర్షం నమోదు కాగా.. ఇతర మండలాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది. 8లో



తాళం వేశారా.. అంతే!


జిల్లాలోని పలుచోట్ల తాళం వేసి ఉన్న ఇళ్లలో ఇటీవల చోరీలు జరుగుతుండడంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
26° / 24°

వాతావరణం

జిల్లా అంతటా బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

భయపెడుతున్న డెంగీ..



జ్వరపీడితులతో కిక్కిరిసిన జిల్లా ఆస్పత్రిలోని జనరల్ ఫీమేల్ వార్డు

జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య నానాటికీ వేగంగా పెరుగుతోంది. డెంగీ వ్యాప్తితో రాష్ట్రంలోని ఐదు జిల్లాలు హైరిస్క్ జోన్‌లో ఉన్నట్లు గుర్తించగా.. జాబితాలో ఖమ్మం సైతం ఉంది. దీంతో ఉన్నతాధికారుల సూచనలతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా జ్వరాలు వస్తున్నప్పటికీ.. డెంగీ కేసుల నమోదు మాత్రం గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటోంది. ఇటీవల రోజుల తరబడి కురిసిన వర్షాలతో మురుగునీరు నిలిచి దోమల వ్యాప్తికి కారణమైనట్లు తెలుస్తుండగా.. ప్రజలు డెంగీ బారిన పడుతున్నారు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

హైరిస్క్ జోన్‌లో ఖమ్మం

- జనవరి నుంచే జిల్లాపై పంజా
- జూలై నెలలో 109 కేసుల నమోదు
- గ్రామీణ ప్రాంతాల్లో విజృంభిస్తున్న జ్వరాలు
- దోమల నివారణపై దృష్టి సారిస్తేనే నియంత్రణ

వర్షాకాలం సీజన్‌లో ఏటా జిల్లాను డెంగీ వణికిస్తోంది. ఈ ఏడాది జూలై నుంచి డెంగీతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. 2021లో 944 మందికి, 2022 ఏడాదిలో 711 మందికి, 2023లో 530 మందికి అధికారిక లెక్కల ప్రకారం డెంగీ సోకింది. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు ఇంకా ఎక్కువ మందే ఉంటారని అంచనా. ఈ గణాంకాల ఆధారంగా గతంలో ఎక్కువ కేసులు నమోదైన ప్రాంతాలపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించి స్థానికులకు అవగాహన కల్పించడమే కాక వైద్యశిబిరాలు నిర్వహిస్తోంది.

ఈ ఏడాది ప్రారంభం నుంచే..

ఈ ఏడాది జిల్లాలో డెంగీ కేసులు ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 12,621 మంది నుంచి శాంపిళ్లు సేకరించగా.. 306 కేసులు నమోదయ్యాయి. సీజన్‌తో సంబంధం లేకుండా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో కూడా నెలకు 30 నుంచి 40 కేసులు నమోదవడం గమనార్హం. మే, జూన్‌లో కాస్త తగ్గినా జూలైలో మళ్లీ కేసుల సంఖ్య పెరిగింది. జూలైలో 109 కేసులు నమోదు కాగా, ఈనెల 1వ తేదీనే ఆరు కేసులు నమోదయ్యాయి. ఏటా జూలై నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో ఎక్కువ కేసులు నమోదవుతుండగా ఈ ఏడాది జనవరి నుంచే డెంగీ పంజా విసిరింది.

వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

డెంగీ కేసుల విషయంలో జిల్లా హైరిస్క్ జోన్‌లో ఉండడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈసారి అత్యధికంగా తెలంగాణలో అత్యధికంగా కేసులు నమోదవుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించిన నేపథ్యాన రాష్ట్రంలో హైరిస్క్ ప్రాంతాలను గుర్తించారు. ఇందులో జిల్లా కూడా ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా నమోదైన డెంగీ కేసుల ఆధారంగా హైరిస్క్ జోన్లను గుర్తించి పరీక్షలు పెంచడంతో పాటు తరచుగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే, ఏదైనా గ్రామంలో కేసులు నమోదు కాగా అధికారులు పరిశీలించి నివారణ చర్యలపై సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

సమన్వయం ఉంటేనే..

అన్నిశాఖలు సమన్వయంతో పనిచేస్తేనే డెంగీ వ్యాప్తిని అరికట్టడం సాధ్యమవుతుంది. ఇందుకోసం వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందకుండా చూడాలి. ఫ్రైడే–డ్రైడే వంటి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముంది. అటు వైద్య, ఆరోగ్యశాఖతో పాటు ఇతర శాఖలు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తిస్తూ ప్రజల్లో కూడా అవగాహన కల్పిస్తే డెంగీ బారిన పడకుండా కాపాడినట్లవుతుంది.

ఆస్పత్రుల కిటకిట

జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా కేంద్రంలో ప్రధాన ఆస్పత్రితో పాటు రెండు ఏరియా ఆస్పత్రులు, నాలుగు సీహెచ్‌సీలు, 26 పీహెచ్‌సీలు, 224 సబ్‌సెంటర్లు, 161 పల్లె దవాఖానాలు ఉన్నాయి. జ్వరాలతో బాధపడుతూ వచ్చిన వారితో ఇవన్నీ కిటకిటలాడుతున్నాయి. మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు కూడా క్యూ కడుతున్నారు. డెంగీతోపాటు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు కూడా విజృంభిస్తుండడంతో వైద్య ఆరోగ్యశాఖ ర్యాపిడ్ యాక్షన్ టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదైనా వెంటనే అదుపులోకి వస్తున్నాయి.

నెలల వారీగా సేకరించిన శాంపిళ్లు, డెంగీ కేసులు వివరాలు

నెల	శాంపిల్స్	డెంగీ కేసులు
జనవరి	1,968	38
ఫిబ్రవరి	1,600	48
మార్చి	1,554	44
ఏప్రిల్	1,059	31
మే	730	05
జూన్	1,007	10
జూలై	3,698	109
ఆగస్టు	1005	21
మొత్తం	12,621	306

ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించండి

- ధంసలాపురం వద్ద ఎగ్జిట్‌కు భూసేకరణ ఖర్చు ప్రభుత్వానిదే..
- ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందనతో మంత్రి తుమ్మల సమీక్ష



ప్రత్యేక కార్యదర్శి హరిచందనతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపైకి ఖమ్మం నుంచి వెళ్లే క్రమాన సూర్యాపేట ఎంట్రీ వద్ద టేకుమట్ల సమీపాన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనతో ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల ప్రగతిపై ఆరా తీసిన ఆయన ధంసలాపురం వద్ద ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ల కోసం సేకరించిన భూమికి పరిహారం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. అందుకు అనుగుణంగా ఎన్‌హెచ్ఏఐకి లేఖ రాసి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే, ధంసలాపురం ఎగ్జిట్, ఎంట్రీ నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే వెంట కలెక్టరేట్ వరకు సర్వీస్ రోడ్లు పూర్తి చేస్తే ఖమ్మంలో ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. కాగా, చిల్లకల్లు(హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి) క్రాస్ నుంచి బోనకల్లు, వైరా, తల్లాడ నుంచి కొత్తగూడెం వరకు జాతీయ రహదారి మంజూరు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించామని మంత్రి తుమ్మల వివరించారు. ఆతర్వాత ఖమ్మం – కురవి, ఖమ్మం – కోదాడ రోడ్డు పురోగతిపై సమీక్షించారు. నెహ్రూనగర్ – కొత్తగూడెం జాతీయ రహదారి టెండర్ల దశలో ఉన్నందున ఆ ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణ పనులు మొదలుపెడతామని హరిచందన తెలిపారు.

ఐదేళ్ల పాలనలో సంతృప్తి



జెడ్పీటీసీలు, ఎంపీపీలతో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు

- సభ్యుల సహకారంతో అభివృద్ధి
- వీడ్కోలు సమావేశంలో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మంవన్‌టౌన్: ఐదేళ్ల పాలన ఎంతో సంతృప్తినిచ్చిందని.. స్వపక్ష, ప్రతిపక్ష సభ్యులంతా అభివృద్ధికి సహకరించారని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. జెడ్పీ పాలకవర్గ పదవీకాలం మంగళవారంతో ముగియగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలపై సమీక్షించగా సభ్యుల ప్రశ్నలకు డీఎంహెచ్ఓ మాలతి, ఏడీ శ్రీరమణి సమాధానాలు ఇచ్చారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గత ఐదేళ్లలోగా ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని, కరోనా సమయాన చేసిన సేవలు సంతృప్తి కలిగించాయని తెలిపారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు సహకరించారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ కమల్‌రాజ్ అందరినీ కలుపుకుంటూ పనిచేశారని.. ఎమ్మెల్సీగా తన విజయానికి సభ్యులంతా సహకరించారని తెలిపారు. అనంతరం చైర్మన్, జెడ్పీటీసీలు, ఎంపీపీలను సన్మానించారు. జెడ్పీ సీఈఓ వినోద్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు. తొలుత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఎస్‌జీఎఫ్ కార్యాలయం ముస్తాబు

- ఆరు జట్లకు వసతి.. బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు
- హంగులు సంతరించుకున్న పాత స్కూల్



కార్యాలయ నిర్వహణకు సిద్ధమైన భవనం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలో పాఠశాలల క్రీడా నిర్వహణకు సంబంధించి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)కు ఇన్నాళ్లు ప్రత్యేక కార్యాలయం లేకపోగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ కృషితో ఓ నీడ దొరికింది. ఖమ్మంలోని జమ్మిబండ ప్రాథమిక పాఠశాల పాత భవనాన్ని ఎస్‌జీఎఫ్‌కు కేటాయించడంతో వివిధ పాఠశాలల పీఈటీ, పీడీలు సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. గడిచిన 50 ఏళ్లుగా జిల్లాలో ఇప్పటివరకు పాఠశాలల క్రీడల నిర్వహణ కోసం ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో పీఈటీలు అవస్థ పడేవారు. వివిధ ప్రాంతాల క్రీడాకారులను ఖమ్మం తీసుకొస్తే ఎక్కడ వసతి కల్పించాలో తెలియక తమ ఇళ్లలోనే రాత్రి ఆశ్రయం కల్పించి ఉదయం పోటీలకు తీసుకెళ్లేవారు. ఈ విషయాన్ని డీఈఓ శర్మ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన జమ్మిబండలో పురాతనమైన ప్రాథమిక పాఠశాల భవనంలో కొన్ని గదులు కేటాయిస్తానని చెప్పారు. కానీ పీఈటీల వినతితో భవనం మొత్తాన్ని ఎస్‌జీఎఫ్ కార్యకలాపాల నిర్వహణకు కేటాయించడం విశేషం.

పీఈటీ, పీడీలే కూలీలు

జమ్మిబండ పాఠశాల భవనానికి రూపురేఖలు తీసుకొచ్చేందుకు జిల్లాలోని పీఈటీ, పీడీలు స్వచ్ఛందంగా వాటాలు వేసుకుని నిధులు సమకూర్చుకున్నారు. ఆపై ఇరవై రోజులుగా సాయంత్రం పాఠశాల ముగియగానే ఇక్కడకు చేరుకుని మరమ్మతుల్లోనూ పాలుపంచుకున్నారు. వృథాగా ఉన్న మట్టిని తీయించడమే కాక ఖాళీస్థలాన్ని చదును చేసి మైదానంగా తీర్చిదిద్దారు. మొత్తం ఆరు గదులు, బాత్‌రూంలు ఉండగా బాలబాలికలకు వేర్వేరుగా కేటాయించనున్నారు. ప్రత్యేకంగా వంటశాల కూడా ఉండడంతో కోచింగ్ క్యాంప్‌లు నిర్వహించిన సమయాన క్రీడలకు వసతి సౌకర్యం కల్పించేందుకు ఓ గూడు దొరికినట్లయింది. ఇక పాఠశాల ఆవరణలో బ్యాడ్మింటన్ కోర్టు సైతం సిద్ధం చేస్తున్నారు.

మరిన్ని వసతులు కల్పిస్తాం...

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో మరిన్ని వసతులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. క్రీడాకారుల ఇబ్బందులను నా దృష్టికి తీసుకురాగానే ఉన్నతాధికారుల అనుమతితో జమ్మిబండలోని స్కూల్ భవనాన్ని కేటాయించాం. ఇందులో ఉన్న మరికొన్ని గదులను సైతం ఇచ్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. అలాగే, జిల్లా పాఠశాలల క్రీడల నిర్వహణ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటాం. – సోమశేఖరశర్మ, డీఈఓ

మండలాల్లోనే సమస్యల పరిష్కారం

- అధికారులు స్కూళ్లలో తనిఖీ చేయాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ

ఖమ్మం సహకారనగర్: ప్రజల సమస్యలు 90శాతం మేర గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కారమవుతాయని.. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోకపోవడంతో కలెక్టరేట్‌కు వస్తున్నారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఇక నుంచి అలా జరగకుండా ఎక్కడికక్కడే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ప్రజావాణి, పాఠశాల భోజనం తనిఖీ, కలెక్టరేట్‌లో సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనలో ప్రతీ స్థాయిలో ఉద్యోగులు తమ విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తే ప్రజల ఇక్కట్లు తీరుతాయని చెప్పారు. ఈ సోమవారం మండల కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో 536 దరఖాస్తులు రాగా.. రెవెన్యూ శాఖకు సంబంధించినవే 363 ఉన్నాయన్నారు. వీటిని శుక్రవారంలోగా పరిష్కరించడమే కాక ఏవైనా తిరస్కరిస్తే అందుకు కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే, ప్రతీ బుధవారం అధికారులు పాఠశాలల్లో భోజనం చేస్తూ మెనూ అమలు, మౌలిక వసతులపై ఆరా తీయాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను తనిఖీ చేయాలని తెలిపారు. అలాగే, కలెక్టరేట్ గేట్ వద్ద బస్ స్టాప్ నిర్మాణం, ఆవరణలో డిస్పెన్సరీ ఏర్పాటు, ఫీడింగ్ రూమ్, బ్యాంక్ ఏర్పాటుపై సూచనలు చేశారు.

హాజరు పెంపుపై దృష్టి సారించండి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు బేస్ లైన్ పరీక్ష నిర్వహించి వెనకబడిన వారిపై శ్రద్ధ వహించాలని చెప్పారు. అలాగే, గ్రామ, మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ప్రణాళిక, పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్ల ఏర్పాటుపై సూచనలు చేశారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు అంతా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జయశంకర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిదని, స్వరాష్ట్రం కోసం జీవితాన్నే అంకితం చేశారని తెలిపారు. ఈ సమావేశాల్లో అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి, డీఈఓ సీఎంఓ రాజశేఖర్, ఏఎంఓ రవికుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాలేరు.. మళ్లీ జలకళ

మండలంలోని పాలేరు రిజర్వాయర్ జలకళ సంతరించుకుంది. రిజర్వాయర్‌కు సోమవారం సాగర్ జలాలు చేరగా నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 17 అడుగులు దాటింది. అంతేకాక సాగర్ నుంచి ఇన్‌ఫ్లో 1,500 క్యూసెక్కుల నుంచి 2,500 క్యూసెక్కులకు పెరిగింది. ఇప్పటికే పాత కాల్వ, భక్తరామదాసు ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు ఎడమ కాల్వ ద్వారా బుధవారం జిల్లాలోని ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని నిర్ణయించారు. రిజర్వాయర్ నీటిమట్టం 20 అడుగులు దాటితేనే నీరు విడుదల చేయాలని భావించినా, రైతుల వినతితో ముందస్తు విడుదలకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యాన ఏర్పాట్లను ఈఈ ఎం.వెంకటేశ్వర్లు, డీఈఈ రత్నకుమారి పరిశీలించారు. - కూసుమంచి



వైరా.. రికార్డుస్థాయిలో నీటి మట్టం

వైరా రిజర్వాయర్ నీటిమట్టం మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ఒకేరోజు 2.50 అడుగుల మేర పెరిగింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో రిజర్వాయర్‌లోకి భారీగా వరద వచ్చి చేరింది. సుమారు 9వేల క్యూసెక్కుల నీరు చేరడంతో నీటిమట్టం 15.9 అడుగులకు చేరగా.. మంగళవారం రాత్రికి 17 అడుగులకు చేరే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు. కాగా, కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగు అవసరాలకు 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. వరద ఇలాగే కొనసాగితే రెండు రోజుల్లో రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టమైన 18.9 అడుగుల దాటి అలుగు పోసే అవకాశముందని తెలిపారు. - వైరా

ప్రభుత్వ పథకాలు అందించడంలో చేయూత



దివ్యాంగుడి నుంచి దరఖాస్తు తీసుకుంటున్న న్యాయమూర్తి, న్యాయవాదులు

ఖమ్మం లీగల్: అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా న్యాయ సేవా సంస్థ సమన్వయకర్తగా వ్యవహరిస్తుందని అదనపు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎం.కల్పన తెలిపారు. ఖమ్మం ఉదయ్‌నగర్‌లోని జోగు భాగ్యమ్మ కుటుంబాన్ని ఆమె మంగళవారం పరామర్శించి మాట్లాడారు. భాగ్యమ్మ కుటుంబ ఇక్కట్లు తెలిసి జిల్లా జడ్జి ఆదేశాలతో వచ్చినట్లు తెలిపారు. ఆమె కుటుంబానికి జిల్లా అధికారుల సహకారంతో వీల్ చైర్ ఇచ్చామన్నారు. ఆపై ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు స్వీకరించగా న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

77 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపులో 77మందిని సర్టిఫికెట్లకు అర్హులుగా గుర్తించారు. ఈ క్యాంపు కోసం 160 మంది దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోగా 125 మంది హాజరయ్యారు. వీరిని పరీక్షించిన వైద్యులు వివిధ విభాగాల్లో 77 మంది సదరమ్ సర్టిఫికెట్లకు అర్హులుగా నిర్ధారించారు.

పోస్టాఫీస్‌ల్లో జాతీయ జెండాల విక్రయం



ఖమ్మం నుంచి పోస్టాఫీస్‌లకు జెండాలు పంపిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: రానున్న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయానికి ఏర్పాట్లు చేశారు. 20x30 సైజ్ జాతీయ జెండా ధర రూ.25గా నిర్ణయించారు. ఈనెల 13వ తేదీ వరకు జాతీయ జెండాలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం ఉండగా, 14వ తేదీ వరకు నేరుగా తపాలా కార్యాలయాల్లోనూ విక్రయిస్తారు. ఈమేరకు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి చేరిన జెండాలను అన్ని పోస్టాఫీసులకు పంపిస్తున్నారు. ఈ సందర్భంగా డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాల బాధ్యులు జాతీయ జెండాల కోసం తపాలా కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

రేషన్ సకాలంలో అందించండి

ఖమ్మం సహకారనగర్: రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరుకులు సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. ఖమ్మం బుర్హాన్‌పురం, తదితర ప్రాంతాల్లో రేషన్‌షాపులను మంగళవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దుకాణదారులు స్టాక్ వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. నిల్వల్లో తేడా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖమ్మం అర్బన్ ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

సంసిద్ధతపై పరిశీలన



విద్యార్థుల ప్రగతిని పరీక్షిస్తున్న పూజాపాటిల్

ఖమ్మం అర్బన్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న పాఠశాల సంసిద్ధత కార్యక్రమ పర్యవేక్షణకు ఢిల్లీలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పూజా పాటిల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం ఖమ్మంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడడంతో పాటు తరగతి గది నిర్వహణ, విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, హెచ్ఎం పాత్ర, మధ్యాహ్న భోజన పథకం అమలుపై వివరాలు ఆరా తీశారు. ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, క్షేత్రస్థాయి పరిశీలకులు టి.జీవన్, రవి, హెచ్ఎం శ్యాం పాల్గొన్నారు.

కేఎంసీ, సుడాకు ఓడీ విధానంలో ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంతోపాటు సుడా కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీర్చేందుకు ఓడీ విధానంలో పలువురికి కేటాయించారు. ఇల్లెందు మున్సిపాలిటీ టీపీఓ ఎస్.కే.ఖలీల్ పాషాను కేఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో ఆయన బుధవారం నుంచి శనివారం వరకు కేఎంసీలో పని చేయాల్సి ఉంటుంది. అలాగే, కొత్తగూడెం మున్సిపాలిటీ టీపీఓ అబ్దుల్ ఖదీర్‌ను ఓడీ విధానంలో సుడాకు కేటాయించగా ఆయన కూడా నాలుగు రోజుల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్‌బీ ఏసీపీ బదిలీ

ఖమ్మంక్రైం: ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ప్రసన్నకుమార్ బదిలీ అయ్యారు. ఆయనను మెదక్ డీఎస్పీగా నియమిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే, ఆయన స్థానంలో ఇక్కడ ఎవరినీ నియమించలేదు.

క్లుప్తంగా

నర్సింగ్ విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు మెమెంటో అందిస్తున్న సూపరింటెండెంట్

ఖమ్మంవైద్యవిభాగం: తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని ఖమ్మం పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ జ్ఞాపికలు అందజేశారు. ఎంసీహెచ్ సూపరింటెండెంట్ బాబు రత్నాకర్, ఆర్ఎంఓ రాంబాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, వైద్యులు యామిని, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

9న జాబ్‌మేళా

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 9న హెచ్‌సీఎల్ కంపెనీ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. 2022–23, 2023–24లో ఇంటర్ బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూప్‌ల్లో 75శాతం మార్కులతో ఉత్తీర్ణత ధ్రువీకరిస్తూ పూర్తి చేసిన విద్యార్థులు డీపీఓ(డిజిటల్ ప్రాసెసర్ ఆఫీసర్) పోస్టుకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు పదో తరగతి మెమో, ఇంటర్మీడియట్ ఆన్‌లైన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఒక ఫొటో, ఆండ్రాయిడ్ ఫోన్‌తో హాజరుకావాలని, వివరాలకు 83414 05102, 90109 26721 నంబర్లలో సంప్రదించాలని డీఐఈఓ సూచించారు.

మైనార్టీ గురుకుల కళాశాలల ఆర్ఎల్‌సీగా వెంకట్రామయ్య



వెంకట్రామయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకట్రామయ్య జిల్లా మైనార్టీ గురుకుల కళాశాలల ప్రాంతీయ సమన్వయ కర్త(ఆర్ఎల్‌సీ)గా నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆయనను అభినందించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులలో ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న జగదీప్‌సింగ్(48) విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన జగదీప్‌సింగ్ గ్రానైట్ మిషన్ మరమ్మతు చేస్తున్నాడు. ఈక్రమంలో విద్యుదాఘాతానికి గురైన ఆయనను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై ఆయన బంధువు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురానికి చెందిన ఎస్.రవి(34) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనులతో జీవనం సాగిస్తున్న ఆయన కొన్నాళ్లుగామద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడంలేదు. దీంతో కుటుంబ సభ్యులు ప్రవర్తన మార్చుకోవాలని సూచించగా భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఈనేపథ్యాన రవి ఊరి బయట ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తల్లాడలో దంచి కొట్టిన వాన

- రఘునాథపాలెం, వైరా, కొణిజర్ల, కల్లూరు మండలాల్లోనూ భారీ వర్షం
- జిల్లాలో సగటున 4.88 సెం.మీ.ల వర్షపాతం నమోదు
- పలుచోట్ల పొంగిన వాగులు, వంకలు



తల్లాడ : బిల్లుపాడు - రామచంద్రాపురం మధ్య వరదతో మూసుకుపోయిన రహదారి

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలో 4.88 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. అయితే, తల్లాడ మండలంలో 12.84 సెం.మీ.ల వర్షపాతం నమోదవడం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటివరకు ఇదే అత్యధిక వర్షపాతమని గణాంకాలు చెబుతున్నాయి. అలాగే, రఘునాథపాలెం, వైరా, కొణిజర్ల, కల్లూరు, తిరుమలాయపాలెం, ఏన్కూరు, పెనుబల్లి, కామేపల్లి మండలాల్లోనూ గరిష్టస్థాయిలో వర్షపాతం నమోదైంది. ఇక ముదిగొండ, సింగరేణి, మధిర, సత్తుపల్లి, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, ఎర్రుపాలెం, చింతకాని, కూసుమంచి, నేలకొండపల్లి బోనకల్ మండలాల్లో కూడా వర్షప్రభావం కనిపించింది.

జలాశయాల్లోకి చేరిన నీరు

విస్తారంగా కురిసిన వర్షాలతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పలు మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయ య్యాయి. ఈ ప్రాంతాల్లోని జలాశయాల్లోకి వరద వచ్చి చేరింది. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షప్రభావం ఉండడంతో భూగర్భజలాల పెంపునకు దోహదపడే అవకాశముంది. కాగా, తాజా వర్షాలకు తోడు పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయనుండడంతో జిల్లాలో పంటల సాగు ఊపందుకోనుంది. జిల్లా పంటల సాధారణ సాగు విస్తీర్ణం 5,22,327 ఎకరాలు కాగా ఇప్పటికే 2,71,138 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో వరి 69,262 ఎకరాలు ఉండగా.. మరికొద్ది రోజుల్లో ఇది గణనీయంగా పెరగనుంది.

పలు మండలాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వర్షపాతం (సెం.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
తల్లాడ	12.84
రఘునాథపాలెం	9.82
వైరా	8.92
కొణిజర్ల	7.86
కల్లూరు	7.24
వేంసూరు	5.68
తిరుమలాయపాలెం	5.24
ఏన్కూరు	4.46
పెనుబల్లి	4.46
కామేపల్లి	4.36

తల్లాడ మండలంలో...

తల్లాడ: తల్లాడ మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మిట్టపల్లి, పినపాక సమీపాన గంగదేవిపాడు వాగు, గొల్లగూడెం జూబంధం వాగు, బిల్లుపాడు–రామచంద్రాపుర గ్రామాల మధ్య వాగు, కుర్నవల్లి–కేశ్వాపురం వాగు, మల్లవరం ఊట వాగు పొంగి ప్రవహించడమేకాక పలు చెరువులకు అలుగు పడింది. పలుచోట్ల పత్తి, వరిపైర్లు నీట మునగగా.. తల్లాడ వీధులు, నారాయణపురం ఇందిరా నగర్‌లోకి వరద నీరు చేరింది.



తల్లాడ : అలుగు పోస్తున్న మల్లవరం పెద్ద చెరువు

కొణిజర్ల మండలంలో...

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో కురిసిన వర్షానికి చెరువుల్లోకి భారీగా నీరు చేరగా వాగులు పొంగి పొర్లడమేకాక పంట పొలాల్లోకి వరద చేరింది. తుమ్మలపల్లి – అన్నవరం మధ్య, కొణిజర్ల – మల్లుపల్లి మధ్య పగిడేరు ప్రవాహంతో అన్నవరం, మల్లుపల్లి , రామనర్సయ్యనగర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. లాలాపురం, తీగలబంజర మధ్య పగిడేరు బ్రిడ్జిపై సుమారు 4అడుగుల మేర నీరు చేరడంతో ఖమ్మం – కొత్తగూడెం రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో తహసీల్దార్ తఫజల్‌హుస్సేన్, ఎంపీఓ రాజేశ్వరితో పాటు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.



కొణిజర్ల : తీగలబంజర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పగిడేరు



కొణిజర్ల : లాలాపురంలోని పత్తి చేనులోకి చేరిన నీరు



కొణిజర్ల : మల్లుపల్లి వద్ద నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతులు

వైరా రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

సీఎం సభకు 12కు పైగా ఎకరాల్లో పంటలు తీయించాలని నిర్ణయం?



రిజర్వాయర్ నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీటిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రెండు పంటలు సాగుచేసేలా నీరు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈమేరకు నీటిని పొదుపుగా వాడుకుంటూ పంటలు పండించుకోవాలని సూచించారు. ఆతర్వాత ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్న రైతు సదస్సుకు సంబంధించి వైరాలో ఎంపిక స్థలాన్ని ఎమ్మెల్యే సహా అధికారులు పరిశీలించారు. సభ నిర్వహణకు 25 ఎకరాల స్థలం అవసరమని గుర్తించగా... ఇప్పటికే కొందరు రైతులు పత్తి, పెసర పంటలు వేసినందున వారికి పరిహారం చెల్లించి పంటలు తీయించాలని భావిస్తున్నారు. సుమారు 12 నుంచి 15 ఎకరాల్లో పంటలు తొలగిస్తేనే సభకు స్థలం సరిపోతుందనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేందర్, ఖమ్మం ఆర్డీఓ గణేష్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఐబీ డీఈ శ్రీనివాస్‌తో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, నర్సిరెడ్డి, సీతారాములు, దానేలు, నాగరాజు, రాజశేఖర్, నాగి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియాను ధైర్యంగా ఎదుర్కోవాలి



మందులు అందిస్తున్న అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రతీ మనిషికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని.. తలసేమియాను సైతం సైతం ఇందులో భాగంగానే చూడాలని అడిషనల్ డీసీపీ ఏ.నరేష్‌కుమార్ సూచించారు. ఖమ్మంలోని రితన్య ఆస్పత్రి తలసేమియా డేకేర్ సెంటర్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన చిన్నారులకు మంగళవారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ప్రతీ 20 రోజులకోసారి రక్తం ఎక్కించుకుంటున్నప్పటికీ ఉత్సాహంగా కనిపిస్తున్న చిన్నారులను చూస్తుంటే తలసేమియాను జయిస్తారనే నమ్మకం ఉందని చెప్పారు. కాగా, చిన్నారుల కోసం కార్యక్రమాలు చేపడుతున్న సంకల్ప సంస్థ బాధ్యులతో పాటు రక్తదానం చేస్తున్న వారిని అభినందించారు. వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పి.అనిత, పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.రవిచందర్, ఎన్.ఉపేందర్ పాల్గొన్నారు.

రహస్య వివాహం.. గర్భం దాల్చాక మోసం

ఖమ్మంక్రైం: వివాహ పరిచయ వేదిక ద్వారా పరిచయం పెంచుకున్న యువకుడు ఓ యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ ఆమె గర్భం దాల్చడంతో ముఖం చాటేసిన ఘటన ఇది. ఖమ్మంకు చెందిన 28 ఏళ్ల యువతికి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని వాసి పాడెబోయిన ప్రవీణ్‌కుమార్‌తో 2022లో పరిచయం ఏర్పడింది. మ్యాట్రిమోనీ ద్వారా పరిచయం కాగా, పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో యువతి ప్రవీణ్‌కు దగ్గరైంది. చివరకు ఆమె గర్భం దాల్చడంతో యువతి ఒత్తిడి మేరకు రహస్యంగా వివాహం చేసుకున్నాడు. ఆపై అబార్షన్ చేయించాలని ప్రయత్నించినా యువతి ససేమిరా అనడంతో దాడి చేశాడు. ప్రస్తుతం ఆమె పాపకు జన్మనివ్వగా ముఖం చాటేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

కేరళ బాధితులకు చిన్నారి విరాళం



రాఘవన్‌కు నగదు అందిస్తున్న జెస్విక

కొణిజర్ల: కేరళలోని వయనాడ్‌లో వరద విలయంతో నష్టపోయిన వారికి కొణిజర్లకు చెందిన చిన్నారి తాళ్లపల్లి జెస్విక తాను దాచుకున్న రూ.4,500 నగదు విరాళంగా అందజేసింది. కొత్తగూడెంలో సీపీఎం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన సదస్సుకు హాజరైన సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు విజయ రాఘవన్‌కు తన తాత తాళ్లపల్లి కృష్ణ, తండ్రి సాయికుమార్‌తో కలిసి వెళ్లిన జెస్విక నగదు అందజేయగా.. పలువురు అభినందించారు.

ముర్రుపాలు.. తల్లీబిడ్డకు శ్రీరామరక్ష

- నేటితో ముగియనున్న తల్లిపాల వారోత్సవాలు
- విస్తృత అవగాహన కల్పించిన అధికారులు

సత్తుపల్లిటౌన్: శిశువుకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచే అమ్మపాలు అమృతంతో సమానమని వైద్యులు చెబుతారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే ఎలాంటి అనారోగ్యం దరిచేరదని నమ్ముతారు. అయితే, బిడ్డ పుట్టిన నాలుగు రోజుల వరకు పాలు రావనే అపోహతో కొందరు తల్లులు తేనె, పంచదారతో కూడిన గ్లూకోజ్ నీరు తాగిస్తుంటారు. అలా కాకుండా బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు రోజు 8 నుంచి 10సార్లు పాలు పట్టాలని అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏటా ఆగస్టు మొదటివారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈనేపథ్యాన జిల్లాలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఈనెల 1న మొదలైన తల్లిపాల వారోత్సవాలు బుధవారం ముగియనున్నాయి.

ముర్రు పాలలో రోగ నిరోధక శక్తి

ప్రసవమయ్యాక మూడు రోజుల వరకు వచ్చే వాటిని ముర్రుపాలు అంటారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేక ఈ పాలను బిడ్డకు ఇవ్వకుండా మూడు రోజుల తర్వాతే ఇస్తుంటారు. కానీ ఈ ముర్రుపాలతో శిశువుల్లో రోగనిరోధక శక్తిని పెంచే గుణం, మాంసకృతులు, విటమిన్లు ఉంటాయి. ఈ పాలు పట్టడం వల్ల పిల్లల్లో చురుకుదనం, తెలివితేటలు పెరుగుతాయి.

తల్లీబిడ్డలకు లాభాలు

తల్లిపాలతో శిశువుకు సమతుల్య ఆహారం అందుతుంది. ప్రొటీన్లు, విటమిన్లు ఉండడంతో కాల్షియం నిల్వలు పెరిగి రక్తహీనతను దూరం చేస్తుంది. మనోవికాసం, మెదడు అభివృద్ధి చెందుతుంది. డయేరియా, న్యూమోనియా, క్యాన్సర్, గుండెజబ్బులు, ఎలర్జీ, అస్తమా, డయాబెటీస్ వాధ్యుల నుంచి రక్షణ కల్పిస్తాయి. పిల్లల శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ఇక బిడ్డకు పాలు పట్టడం ద్వారా ప్రసవమయ్యాక తల్లులు బరువు పెరగడాన్ని నియంత్రించడమే కాకుండా తల్లీబిడ్డకు అనుబంధం పెంపొందించుకోవచ్చు. అలాగే, గర్భసంచి ముడుచుకుపోయి రక్తస్రావం తగ్గి త్వరగా కోలుకుంటారు. రొమ్ము కేన్సర్ నుంచి కాపాడడంతో పాటు ఎముకల దృఢత్వానికి మార్గం ఏర్పడుతుంది.

ముర్రుపాలు పట్టించా..



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో సాధారణ కాన్పు అయింది. బాబు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించా. పాలుపట్టించే విధానంపై ఇక్కడి నర్సులు అవగాహన కల్పించారు. డబ్బా పాల కంటే తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని చెప్పారు.

– కె.కుమారి, బాలింత, సత్తుపల్లి

డీసీసీబీ పాలకవర్గ సమావేశం నిర్వహించాలి

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని డైరెక్టర్లు లక్కినేని సురేందర్‌రావు, జనగం కోటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా సహకార అధికారికి మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమావేశాన్ని ఐదు నెలలు గడిచినా నిర్వహించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రుణమాఫీ, కొత్త రుణాలు ఇవ్వాల్సి ఉన్నందున వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మంఅర్బన్: ఎర్రుపాలెం మండలానికి చెందిన యువకుడిపై ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. ఎర్రుపాలెం మండలానికి చెందిన ఆయన నగరానికి చెందిన 17ఏళ్ల బాలిక ఇంటి వద్దకు వచ్చి తరచుగా వేధిస్తున్నాడు. దీంతో ఆమె కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేశారా.. అంతే!

సత్తుపల్లిలో నివసించే ఉపాధ్యాయ దంపతులకు ఇటీవల పదోన్నతి లభించింది. ఇలా పదోన్నతి వచ్చిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిసి అధికారులు ఏర్పాటు చేసిన బస్సులో సంతోషంగా వెళ్లారు. తీరా వారు వచ్చేసరికి ఇల్లు తాళం పగలగొట్టి ఉండడం.. బీరువాలో భద్రపరిచిన రూ.లక్ష నగదు, ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీ కావడంతో పదోన్నతి దక్కిన ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

- జిల్లాలో దొంగలస్వైరవిహారం
- అంతర్రాష్ట్ర ముఠాల పనిగా అనుమానం

ఖమ్మంక్రైం: కొంతకాలంగా జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో సైతం దొంగల స్వైరవిహారం కొనసాగుతోంది. తాళం వేసి ఉన్న ఇల్లు కనిపిస్తే చాలు చొరబడి ఉన్నందంతా ఊడ్చుకెళ్తున్నారు. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఉదయమంతా ఎవరికీ అనుమానం రాకుండా రెక్కీ నిర్వహించడం... రాత్రి వేళ చోరీకి పాల్పడుతున్నారు.

జైలులో పరిచయాలు, వ్యూహాలు

వరంగల్‌లో సెంట్రల్ జైలును కూల్చివేశాక అక్కడ శిక్ష అనుభవిస్తున్న అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాల దొంగలను ఖమ్మం జిల్లా జైలుకే తరలిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు సంబంధించి నేరస్తులు ప్రస్తుతం ఇక్కడే శిక్ష అభవిస్తున్నారు. ఈనేపథ్యాన వీరిలో ఒకరికొకరు పరిచయం పెరిగి దొంగతనాలను సులువుగా చేసే మార్గాలను ఇచ్చిపుచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. కొద్దినెలల క్రితం ఖమ్మంలో జరిగిన ఓ చోరీ కేసులో నిందితుడు వైజాగ్ వాసిగా తేలింది. ఆయనను అరెస్ట్ చేసి విచారించగా వరంగల్ జిల్లాలో చోరీ కేసులో పట్టుబడిన తనను ఖమ్మం జైలుకు తీసుకొచ్చారని.. ఇక్కడ శిక్ష అనుభవిస్తున్న వారు ఖమ్మంలో చోరీకి అనువైన మార్గాలను చెప్పారని ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఇలాంటి కేసుల్లో విచారణ ముమ్మరం చేశారు.

అన్నీ కొత్త ముఖాలే...

ఇళ్ల తాళాలు పగులకొట్టడానికి గతంలో మాదిరి సుత్తెలు, ఇతర సామగ్రి కాకుండా అధునాతన పరికరాలను నిందితులు సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఆయుధాలతో చడీచప్పుడు కాకుండా తాళం పగలగొట్టి సొత్తు ఎత్తుకెళ్తున్నారు. దీనికి తోడు పాత నేరస్తులు కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ముఠాలు ఇక్కడకు వచ్చాయని తెలుస్తుండగా నిందితులను గుర్తించడం పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. ఒక కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి హమ్మయ్య అనుకుంటుండగానే.. మరో చోరీ జరుగుతుండడం గమనార్హం. అంతేకాక నిందితులు చోరీ సొత్తును ఇతర ప్రాంతాలకు తరలిస్తుండడంతో రికవరీ చేయడానికి సమయం పడుతున్న నేపథ్యాన పోలీసులు కొన్ని కేసులను పక్కన పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పోలీస్ నిఘా అంతంతే...

జిల్లాలో దొంగతనాలు పెరగటానికి పోలీస్ నిఘా కొరవడడం కూడా ఓ కారణమని తెలుస్తోంది. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బ్లూకోర్ట్స్ సిబ్బందితో పాటు పెట్రోకార్లు ఉన్నాయి. వీటికి తోడు పెట్రోలింగ్ సిబ్బంది ఉంటారు. అయినా దొంగలు పేట్రేగిపోతుండడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల పోలీసులకు చిక్కిన ఓ అంతర్రాష్ట్ర దొంగ ఖమ్మం సారథినగర్‌లో కొన్నాళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నట్లు తేలడం గమనార్హం. పలు ప్రాంతాల్లో చోరీ చేసినా పోలీసులు చాన్నాళ్లు కనిపెట్టలేకపోయారు. దీనికితోడు జైలు నుండి విడుదలవుతున్న వారి కదలికలపై నిఘా వేయకపోవడం కూడా నిందితులకు కలిసొస్తోంది. ఇకనైనా పెట్రోలింగ్ పెంచి పాతనేరస్తుల కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సత్తుపల్లిలో ఇటీవల చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

సమాచారం ఇవ్వండి...

తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు తప్పకుండా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. అంతేకాక ఇంటి పక్కన ఉన్న వారికి కూడా తరచూ పరిశీలించేలా చెప్పాలని అవగాహన కల్పిస్తున్నారు. అలాగే, కాలనీల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రచారం చేస్తున్నారు. విలువైన ఆభరణాలు, నగదు ఇళ్లలో ఉంచొద్దని చెబుతున్నా.. కొందరు ఒకటి, రెండు రోజులే కదా అని తాళం వేసి వెళ్తుండడంతో దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. ఈ నేపథ్యాన అటు పోలీసులు నిఘా పెంచడమే కాక ఇటు ప్రజలు సైతం జాగ్రత్తలు వహిస్తే దొంగల బెడద నుంచి బయటపడొచ్చు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మధిర: మధిర బంజారా కాలనీకి చెందిన అద్దంకి రవీంద్ర(18) వైరా నదిలో ఈత కొట్టేందుకు సోమవారం వెళ్లి గల్లంతు కాగా.. ఆయన మృతదేహం మంగళవారం లభ్యమైంది. సోమవారం సాయంత్రం ఆయన స్నేహితులు ఇచ్చిన సమాచారంతో గాలింపు చేపట్టినా ఫలితం లేకపోగా చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు. తిరిగి మంగళవారం ఉదయం అగ్నిమాపక శాఖ సిబ్బంది, పోలీసులు, మధిర స్విమ్మర్స్ అసోసియేషన్, ఆర్కే ఫౌండేషన్ బాధ్యులు వెతకగా రవీంద్ర మృతదేహం లభించడంతో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

తండ్రిపై దాడి.. ముగ్గురిపై కేసు

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో భూవివాదం నేపథ్యాన తండ్రిపై దాడి చేసిన కుమారుడు సహా ముగ్గురిపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యల్లావుల సీతారాములు పేరిట ఉన్న ఎకరం వ్యవసాయ భూమిని తమకు రిజిస్ట్రేషన్ చేయాలని ఆయన కొడుకు కృష్ణ, కోడలు ప్రమీల, మనుమడు గణేష్ గొడవపడి దాడి చేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పాలు పోసొచ్చే సరికి ఆటో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డులో మంగళవారం ఉదయం ఆటో చోరీకి గురైంది. గుదిమళ్ల ప్రాంతానికి చెందిన ఉపేందర్ ఆటో నడుపుతూ ప్రతిరోజు నగరంలో పలువురికి పాలు పోస్తుంటాడు. మంగళవారం కూడా పంపింగ్ వెల్ రోడ్డుకు వచ్చిన ఆయన ఆటో(టీఎస్04 యూబీ 0478) నిలిపి మొదటి అంతస్తులో ఉన్నవారికి పాలు పోసేందుకు వెళ్లాడు. ఇంతలోనే ముఖానికి గుడ్డ కట్టుకున్న గుర్తుతెలియని వ్యక్తి ఆటో తీసుకుని పారిపోయాడు. శబ్దం విన్న ఉపేందర్ వచ్చేసరికి ఆయన కానరాకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

కల్లూరులో చోరీ

కల్లూరు: కల్లూరులోని చంద్రుపట్ల రోడ్డులో నివాసముంటున్న కాటమనేని శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. గతనెల 31న ఇంటి యజమాని కాటమనేని శ్రీనివాసరావు తాళం వేసి ఊరికి వెళ్లాడు. మంగళవారం ఉదయం తాళం పగలగొట్టి ఉండడంతో సమీప ఇంటి యజమానులు శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన చేరుకుని పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు నగదు కలిపి రూ.48వేల విలువైన సొత్తు జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షాకీర్ తెలిపారు.